నమస్తే తెలంగాణ
# రాజన్న సిరిసిల్ల
5 | కరీంనగర్, గురువారం 15 మే 2025 | RAJANNA SIRCILLA

### ఎప్పుడిత్తరో చెప్తలేరు



రేషన్‌బియ్యం ఇంకా రాలేదు. ఎప్పుడిత్తరో ఎవ్వలు చెప్తలేరు. మా తండోల్లు సార్లకు ఫోన్ జేసిన్రట. ఎవ్వరు కూడా సరిగా వచ్చేది చెప్తనే లేరంటున్రు. మేం ఆరుగురం ఉన్నం. మాకు 36 కిలోల బియ్యం వత్తయ్. ఒకటి తారీఖు నుంచి 15 తారీఖు లోగా ఇచ్చుడు అయిపోతుండె. ఇప్పటిదాకా రానే లేదు.

**- భూక్యా శైలజ, రాజ్యానాయక్ తండా (ఎల్లారెడ్డిపేట)**

### ఇప్పటికీ ఇయ్యలె



మేము రేషన్‌బియ్యమే తింటం. ఎప్పుడూ పది తారీఖు లోపే బియ్యం ఇచ్చేది. ఈ సారి ఇప్పటికీ బియ్యం ఇయ్యలె. మేం ముగ్గురం ఉన్నం. 18 కిలోల బియ్యం వత్తయ్. ఇంకా రాలె. ఎవ్వరిని అడిగినా మాకు తెల్వదంటుర్రు.

**-భూక్యా అంబవ్వ, రాజ్యానాయక్‌తండా (ఎల్లారెడ్డిపేట)**

రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన సన్న బియ్యం పంపిణీ మూడు రోజుల ముచ్చటే అవుతున్నది. ఈ నెల మొదలై దాదాపు పదిహేను రోజులవుతున్నా ఇప్పటి వరకు రేషన్ షాపుల్లో సగం మందికి కూడా అందలేదు. పంపిణీలో తీవ్ర జాప్యమవుతుండడంతో పేదలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోదాముల వద్ద డీలర్ల పడిగాపులుకాస్తుండగా.. షాపుల చుట్టూ ప్రజలు చక్కర్లు కొడుతున్నారు. మొత్తంగా ప్రజా పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారగా, కేసీఆర్ పదేండ్ల పాలనలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి తలెత్తలేదని గుర్తు చేస్తున్నరు.







తిమ్మాపూర్‌లో మూసిఉంచిన రేషన్‌షాపు

# సన్న బియ్యం సగం మందికి రాలే!

- మురిపించి.. మూడు రోజులే పంపిణీ
- గోదాముల చుట్టూ డీలర్లు
- పద్నాలుగు రోజులు గడిచినా రేషన్ షాపులకు చేరని రైస్
- దుకాణాల వద్ద పేదల పడిగాపులు

రాజన్న సిరిసిల్ల, మే 14 (నమస్తే తెలంగాణ): సన్న బియ్యం పేదలకు అందడంలో ఆలస్యమవుతున్నది. పంపిణీ గడువు దాటుతున్నప్పటికీ ఇంకా దుకాణాలకు చేరలేదు. దీనికి కారణం అధికారుల నిర్లక్ష్యమా? ప్రభుత్వ వైఫల్యమా? అన్న చర్చ జరుగుతున్నది. రేషన్ షాపుల ద్వారా ప్రతినెలా ఒకటో తేదీ నుంచి పేదలకు బియ్యం పంపిణీ చేయాల్సి ఉంది. నెల చివరి వారంలోగా అన్ని దుకాణాలకు రేషన్ బియ్యం గోదాముల నుంచి సరఫరా చేయాలి. అయితే, ప్రస్తుతం 11వ తేదీ వచ్చి పంపిణీ గడువు ముగుస్తున్నా ఇప్పటి వరకు కొంత మందికి మాత్రమే బియ్యం అందాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొత్తం 345 రేషన్ దుకాణాలుండగా, మిగిలిన 223కుపైగా దుకాణాలకు ఇంకా బియ్యం రాలేదు. దీంతో రేషన్ బియ్యంపై ఆధార పడ్డ పేదల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది.

### లబ్ధిదారులు 5,22,764

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొత్తం 1,97,805 రేషన్ కార్డులుండగా, లబ్ధిదారులు 5,22,764 మంది ఉన్నారు. కార్డుల్లో 1,60,349 ఫుడ్ సెక్యూరిటీ కార్డులకు 4,85,308 మంది లబ్ధిదారులు, 13,752 అంత్యోదయ కార్డులకు 37,456 మంది లబ్ధిదారులు ఉన్నారు. మొత్తం లబ్ధిదారులుకు ప్రతినెలా 29,118.48 క్వింటాళ్ల బియ్యం పంపిణీ జరుగుతున్నది. ప్రతి నెలా 26వ తేదీ వరకు జిల్లాలోని 255 గ్రామ పంచాయతీల పరిధిలోని రేషన్ దుకాణాలకు సిరిసిల్ల, వేములవాడ పౌరసరఫరా గోదాముల నుంచి లారీల ద్వారా బియ్యం చేరవేస్తారు. ఈ ప్రక్రియ 31లోగా పూర్తి చేయాలి. డీలర్లు ప్రతి నెలా ఒకటి నుంచి 15వ తేదీ వరకు పంపిణీ చేయాల్సి ఉండగా, ఈనెల ఇప్పటి వరకు కొన్ని దుకాణాలకు బియ్యం చేరకపోవడంతో ఇంకెప్పుడు పంపిణీ చేయాలంటూ డీలర్లు ప్రశ్నిస్తున్నారు. సిరిసిల్ల అర్బన్, వేములవాడ అర్బన్ మండలాలతోపాటు కొన్ని మండలాలకు మాత్రమే గోదాముల నుంచి బియ్యం చేరుకున్నాయి. 345 మంది డీలర్లుంటే అందులో 122 మంది డీలర్లకు మాత్రమే అందాయి. సిరిసిల్ల గోదాం పరిధిలో 247 దుకాణాలకు 79 దుకాణాలకే బియ్యం సరఫరా చేశారు. 19,400ల క్వింటాళ్లకు 12 వేల క్వింటాళ్లు మాత్రమే వచ్చాయి. ఇంకా 7,400 వేల క్వింటాళ్ల బియ్యం రావాల్సి ఉంది. వేములవాడ పరిధిలో 98 దుకాణాలుండగా అందులో 43 దుకాణాలకు మాత్రమే బియ్యం చేరినట్లు తెలిసింది.

### పేదల ప్రదక్షిణలు

రేషన్ బియ్యంపై ఆధారపడేది ఎక్కువగా గ్రామీణ పేదలే. నెలరాగానే ఎదురుచూసేది వాళ్లే. ప్రతి నెలా ఒకటి నుంచి 15లోగా ఇవ్వాల్సిన రేషన్ బియ్యం నేటికీ అందకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని గ్రామాల్లో కొద్దిపాటి స్టాక్ వచ్చిన రోజే అయిపోవడం, మళ్లీ రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. బియ్యం కోసం రేషన్ షాపుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎప్పుడొస్తాయని డీలర్లకు ఫోన్లు చేస్తున్నారు. స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులను కూడా ఆరా తీస్తున్నారు. సన్న బియ్యం దేవుడెరుగు కనీసం తినేందుకు దొడ్డు బియ్యం ఇచ్చినా బాగుండేదని చెబుతున్నారు.

### డీలర్ల పడిగాపులు

జిల్లాలో ఇంకా 223 మంది డీలర్లు గోదాముల వద్ద పడిగాపులుగాస్తున్నారు. అదిగో ఇదిగో అంటూ చెబుతున్న అధికారులు స్పష్టమైన సమాచారం ఇవ్వడం లేదంటూ డీలర్లు వాపోతున్నారు. కాగా, పోర్టబిలిటీ 7 నుంచి 9 వరకే ఉన్న గడువు కూడా ముగిసింది. రైస్ రిక్వైర్‌మెంట్ కోసం ఆన్‌లైన్‌లో డీలర్ పెట్టుకోవాల్సిన రిక్వెస్ట్ టైం కూడా దాటిపోవడంతో డీలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల బియ్యం పంపిణీలో జాప్యం జరిగితే వచ్చే నెల మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంటుంది. సిరిసిల్ల జిల్లాకు రావాల్సిన బియ్యం పెద్దపల్లి జిల్లా నుంచి వస్తున్నాయి. యాసంగి పంట దిగుబడితో లారీలన్నీ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పరిమితం కావడంతో బియ్యం సరఫరాలో ఆలస్యం జరిగిందని అధికారులు చెపుతుండగా, డీలర్లు మాత్రం వారి నిర్లక్ష్యమే కారణమంటున్నారు. గత పదేండ్లుగా ధాన్యం కొంటలేరా? బియ్యం పంపిణీ జరగలేదా? అంటూ ప్రజలు మండి పడుతున్నారు. అప్పుడెట్ల సాధ్యమైంది. ఇప్పుడెందుకు ఆలస్యమవుతుందంటూ నిలదీస్తున్నారు.

### నాణ్యతా కరువే!

ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్నబియ్యంలో 40 శాతం నూకలే ఉంటున్నాయని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోదాములకు వచ్చే బియ్యం తనిఖీ చేసేందుకు క్వాలిటీ కంట్రోల్ అధికారి పట్టించుకోకపోవడమే దీనికి కారణమని ఆరోపిస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతి నెలా పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీ చేసిన తర్వాతనే డీలర్లకు చేరేవి. అప్పుడు ఉన్న క్వాలిటీని పరిశీలించే యంత్రాలు కూడా గోదాముల్లో కానరావడం లేదు. పేదల కోసం ఇస్తున్న సన్నబియ్యం మిల్లర్ల కక్కుర్తితో నూకలు వస్తున్నాయని పలువురు వాపోతున్నారు. మరోవైపు 50.580 కిలోలు ఉండాల్సిన బియ్యం బ్యాగు 47 నుంచి 48 కిలోలు మాత్రమే ఉంటుందని చెబుతున్నారు. దీంతో ఒక్కో డీలరు క్వింటాల్ నుంచి రెండున్నర క్వింటాళ్ల వరకు నష్టపోతున్నాడు. దీనికి కారణం గోదాం వద్ద వే బ్రిడ్జి లేకపోవడమే కారణమన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ జిల్లాలో ఉన్నట్టు సమాచారం కూడా లేదని తెలుస్తున్నది.



మూసి ఉన్న దుకాణాలు

# వేములవాడ బంద్ సక్సెస్

- స్వచ్ఛందంగా ముందుకొచ్చిన వ్యాపారులు
- దుకాణాలు, వ్యాపార సముదాయాలన్నీ క్లోజ్
- రాజన్న ఆలయ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహణ
- అభివృద్ధి పేరిట రాజన్న ఆలయం మూసివేత సరికాదని ఆగ్రహం
- పనులు కొనసాగిస్తూనే దర్శనం కల్పించాలని డిమాండ్

వేములవాడ, మే 14: వేములవాడ పట్టణం బంద్ సక్సెస్ అయింది. అభివృద్ధి పేరిట రాజన్న ఆలయాన్ని వచ్చే నెల 15 నుంచి మూసివేయాలని ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా వేములవాడ రాజన్న ఆలయ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్‌కు విశేష స్పందన వచ్చింది. తిప్పాపూర్ బస్టాండ్, మూలవాగు వంతెన నుంచి జాతర గ్రౌండ్, ప్రధానాలయం రహదారి, పాత ఆంధ్ర బ్యాంక్, బద్ది పోచమ్మ వీధి నుంచి కోరుట్ల బస్టాండ్ ప్రాంతంలోని వ్యాపారులు స్వచ్ఛందంగా ముందుకురాగా, దుకాణాలు, వ్యాపార సముదాయాలన్నీ మూతపడ్డాయి. వీధులన్నీ వెలవెలబోయి కనిపించాయి. ఈ సందర్భంగా ఆలయ పరిరక్షణ సమితి అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి రామతీర్థపు రాజు పలువురు నాయకులతో కలిసి పట్టణంలో పాదయాత్ర తీశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రాజన్న ఆలయ అభివృద్ధి విషయంలో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి నిబద్ధత లేదని విమర్శించారు. ఆలయానికి మొత్తం ఎన్ని కోట్లు మంజూరయ్యాయి? పూర్తి బడ్జెట్ ఎంత? అనేది చెప్పకుండా, అభివృద్ధి నివేదికలను బహిర్గతం చేయకుండా ఎందుకు గోప్యత పాటిస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. వాస్తు పేరిట రాజన్న ఆలయంలోని పలు అంతర్ దేవాలయాలను ముట్టుకుంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆలయ అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, ఏకపక్ష నిర్ణయాలతో ముందుకుపోవడమే సరికాదన్నారు. ఆలయాన్ని మూసివేయాలనే నిర్ణయం సరికాదని, భక్తులకు దర్శనానికి అనుమతినిస్తూనే, అభివృద్ధి చేపట్టాలని డిమాండ్ చేశారు. వేములవాడ పట్టణ సీఐ వీర ప్రసాద్ పట్టణంలోని ప్రధాన ప్రాంతాలు, కూడళ్లలో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, సిరిగిరి రామచందర్, నరాల శేఖర్, జోగిని శంకర్, నాయకులు రేగుల మల్లికార్జున్, పిన్నింటి హన్మాండ్లు, కృష్ణస్వామి, గోపు బాలరాజు, వెంగళ శ్రీకాంత్ గౌడ్, మంద రాజేందర్ ఉన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో నాసిరకం కోడిగుడ్లు

కోరుట్ల రూరల్, మే 14 : వేసవి సెలవుల నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్ర నిర్వాహకులు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు కోడిగుడ్లను ఇంటికే పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో కోరుట్ల మండలం చిన్నమెట్‌పల్లి గ్రామంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో నాసిరకం కోడిగుడ్లను పంపిణీ చేశారు. బుధవారం ఒకరికి పంపిణీ చేసిన కోడిగుడ్లను ఉడికించగా దుర్వాసన రావడంతోపాటు కుల్లిపోవడంతో అవాక్కయ్యారు. దీంతో అంగన్‌వాడీ నిర్వాహకురాలిని అడుగగా.. ప్రభుత్వం పంపిణీ చేసిన కోడిగుడ్లను అందించినట్టు తెలిపారు.



పంపిణీ చేసిన నాసిరకం కోడిగుడ్లు



పెద్దపల్లి: తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతులు

- పెద్దపల్లి జిల్లాలో అర్ధరాత్రి జోరువాన
- కొనుగోళ్ల జాప్యంతో కేంద్రాల్లోనే తడిసిన ధాన్యం
- ఆరుగాలం కష్టం నీళ్లపాలు
- రైతులు లబోదిబో
- మడకలో కరెంట్ వైర్లు తెగి 25 గొర్రెలు మృత్యువాత
- నష్ట పరిహారం అందించాలని వేడుకోలు

## లారీని వెంబడించి.. స్వాధీనం చేసుకొని

- ఎర్రగుంటపల్లిలో 211.50 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ సీజ్
- మంచిర్యాల నుంచి హుజూరాబాద్ తరలిస్తుండగా సివిల్స్ సప్లయిస్ టాస్క్ ఫోర్స్ మెరుపుదాడి

ధర్మారం, మే14: రేషన్ బియ్యం పక్కదారిపై సివిల్స్ సప్లయిస్ టాస్క్ ఫోర్స్ అధికారులు స్పెషల్ ఫోకస్ పెట్టారు. మంచిర్యాల నుంచి అక్రమంగా తరలిస్తున్న లారీని వెంబడించి ధర్మారం మండలంలోని ఎర్రగుంటపల్లిలో పట్టుకొని బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట నుంచి లారీలో పెద్దమొత్తంలో రేషన్ బియ్యం తరలిస్తున్నారనే హైదరాబాద్ సివిల్ సప్లయిస్ కమిషనరేట్ టాస్క్ ఫోర్స్ అధికారులకు సమాచారం అందింది. బుధవారం ఉదయాన్నే రంగంలోకి ఇక్కడికి వచ్చిన అధికారులు, లారీని వెంబడించారు. ఎర్రగుంటపల్లి శివారులో వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. బస్తాల్లో ఉన్న రేషన్ బియ్యాన్ని గుర్తించారు. లారీ డ్రైవర్ ఆముదాపురం సతీశ్‌ను విచారించారు. హసన్‌పర్తికి చెందిన మోతే శేఖర్ అనే వ్యక్తి లారీని కిరాయికి మాట్లాడుకోవడంతో తాను బియ్యాన్ని లక్షెట్టిపేట నుంచి హుజూరాబాద్ తరలిస్తున్నట్లు సతీశ్ పేర్కొన్నాడు. రూ.8లక్షల విలువైన 211.50 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. పెద్దపల్లి సివిల్ సప్లయిస్ డీటీ గోపిడి రవీందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ధర్మారం ఎస్ఐ శీలం లక్ష్మణ్ తెలిపారు.



జూలపల్లి : ధాన్యాన్ని పారతో కుప్పగా చేస్తున్న మహిళా రైతు



దుకాణాలను తొలగిస్తున్న సిబ్బంది

## బతుకులు రోడ్డుపాలు

- ఖనిలో సర్వీస్ రోడ్డు కోసం దుకాణాలు అర్ధంతరంగా నేలమట్టం
- వ్యాపారులు కన్నీరుమున్నీరు
- అధికారుల తీరుపై రామగుండం మాజీ ఎమ్మెల్యే చందర్ అసహనం
- విధ్వంసకాండ ఇంకెంత కాలమని ఆగ్రహం

కోల్‌సిటీ, మే 14: గోదావరిఖని బస్టాండ్ ఏరియా రాజీవ్ రహదారి వెంట ఉన్న వ్యాపారులు రోడ్డున పడ్డారు. దాదాపు 20 ఏండ్లుగా హోటళ్లు, పాన్ టేలాలు పెట్టుకొని జీవిస్తుండగా, సర్వీస్ రోడ్డు నిర్మాణం కోసం బుధవారం ఉదయం అధికారులు అర్ధంతరంగా జేసీబీ సాయంతో కూల్చివేయడంతో రేపటి సంది బతుకుడెట్లా..? అంటూ కన్నీటిపర్యంతమయ్యారు. ఇన్నాళ్లు అన్నం పెట్టిన దుకాణాలు కళ్లెదుటే నేలమట్టం అవుతుంటే బరువెక్కిన గుండెలతో లబోదిబోమన్నారు. సర్వీస్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయడానికే దుకాణాలు కూల్చివేయాల్సి వచ్చిందని నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు చెప్పారు. అయితే బస్టాండ్ మూలమలుపు వద్ద ఉన్న ఓ మద్యం దుకాణాన్ని మాత్రం వదిలిపెట్టి ఆ పక్కన ఉన్న షాపులను కూల్చివేయడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ సంఘటన స్థలానికి చేరుకొని కూల్చివేతల చర్యలను ఖండించారు. ఆగ్రహం వ్యక్తం చేశారు. రామగుండంలో అభివృద్ధి పేరుతో విధ్వంసకాండ ఇంకెంత కాలం సాగుతుందో..? ఓపిక పడుతున్నామనీ, ప్రజలే తగిన గుణపాఠం చెప్తారన్నారు. ఇప్పటికే ప్రధాన వ్యాపార కేంద్రమైన లక్ష్మీనగర్‌లో మొబైల్ దుకాణాలను, ఓల్డ్ అశోక్ థియేటర్‌ను కూల్చివేసి అనేక మంది వ్యాపారుల బతుకులను ఆగమాగం చేశారని, ఇంకెంత మంది జీవితాలను రోడ్డుపాలు చేస్తారని ప్రశ్నించారు.



జూలపల్లి : కోనరావుపేటలో తడిసిన ధాన్యాన్ని చూపెడుతున్న రైతు కత్తెర్ల తిరుపతి

# 'అకాల' నష్టం

**అకాల వాన రైతన్నను వెంటాడుతున్నది. ఆరుగాలం కష్టాన్ని నీళ్లపాలు చేస్తూ అపార నష్టాన్ని తెచ్చిపెడుతున్నది. ఓ వైపు కొనుగోళ్లలో నిర్లక్ష్యంతో కేంద్రాల్లోనే ధాన్యం రోజుల తరబడి మూలుగుతున్నది. తాజాగా మంగళవారం అర్ధరాత్రి తర్వాత పడిన వానకు ఎక్కడికక్కడ తడిసిపోయి, కొట్టుకుపోయింది. పెద్దపల్లి జిల్లాలో తీవ్రత ఎక్కువగా ఉండగా, రైతులు లబోదిబోమంటున్నారు. తమను ఆదుకోవాలని కోరుతున్నారు.**

పెద్దపల్లి/ పెద్దపల్లిరూరల్/ ఓదెల, మే14: అకాల వర్షాలు అన్నదాతకు కన్నీరు పెట్టిస్తున్నాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంట అమ్ముకొనే దశలో అన్నదాతలను ఆగమాగం చేస్తున్నాయి. ఈ నెల 10న సాయంత్రం కురిసిన వానకు జరిగిన నష్టంతో తేరుకోకముందే తాజాగా మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారు జాము వరకు బలమైన ఈదురుగాలులుతో పడిన అకాల వర్షానికి తీవ్ర నష్టం జరిగింది. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో హాకా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో ధాన్యం తడిసిపోయింది. తీరని నష్టం జరిగింది. ఒక ఆధార్ కార్డుకు కేవలం 2 టార్ఫాలిల్ కవర్లు మాత్రమే ఇస్తున్నారని, వర్షానికి ధాన్యాన్ని కాపాడుకోవడం కష్టమైతున్నదని రైతులు వాపోతున్నారు. పెద్దపల్లి మండలంలో దాదాపు అన్ని గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. పలు చోట్ల నీటిలో కొట్టుకుపోగా రైతులు పోగుచేసుకుని కుప్పలు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇక ఆలస్యంగా వరి సాగు చేసిన అందుగులపల్లి, అప్పన్నపేట, హన్మంతునిపేట, పెద్దకల్వల, పెద్దబొంకూర్, చీకురాయి, భోజన్నపేట గ్రామాలలో కోతకు వచ్చిన పంట నేలవాలింది. ఈదురుగాలుల వర్షానికి జూలపల్లి మండలం అతలాకుతలమైంది మామిడి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కోనరావుపేటలో రోడ్డు కిరువైపులా ఉన్న చెట్లు గాలి వానకు విరిగిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది. కేంద్రాల్లో తూకం వేసి బస్తాల్లో నింపిన ధాన్యం తడిసిపోగా, రైతులదే బాధ్యత అంటూ నిర్వాహకులు తేల్చిచెప్పడంతో ఆందోళన పడుతున్నారు. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసిముద్దయింది. కాగా, జరిగిన నష్టాన్ని అధికారులు గుర్తించి పక్కా అంచనాలు తయారు చేసి పరిహారం అందేలా చూడాలని కోరుతున్నారు.

### మడకలో 25గొర్రెలు మృతి

బలమైన ఈదురుగాలులతో కూడిన వర్షానికి కరంట్ వైర్ తెగి గొర్రెల మంద చుట్టూ ఉన్న ఇనుప కంచెపై పడడంతో ఓదెల మండలం మడక గ్రామంలో 25గొర్రెలు మృతి చెందాయి. దాదాపు ₹5లక్షల వరకు నష్టం జరిగినట్లు గొర్రెల కాపరి వేల్పుల రాజకొమురయ్య తెలిపాడు. ఉపాధి లేక నిరాశ్రుడైన తన కుటుంబానికి ప్రభుత్వం ఆర్థికంగా సాయం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.



### 15 రోజులైనా కాంటా పెట్టలే..

ఎకర ముప్పై గుంటలలో వరి వేసిన. రెండు ట్రాక్టర్ల లోడ్ వడ్లు పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డుకు 15 రోజుల క్రితం తెచ్చిన. ప్రతి రోజూ ఆరబెట్టిన. 9న శుక్రవారం శనివారం మాయిశ్చర్ వచ్చింది. సాయంత్రం సంచులు ఇస్తామన్నారు. కానీ, సంచులు ఇవ్వలే. శనివారం సాయంత్రం వాన పడడంతో ధాన్యం పూర్తిగా తడిసింది. మళ్లీ ఆరబెట్టిన మాయిశ్చర్ కూడా వచ్చింది. కానీ, బుధవారం తెల్లవారు జామున పడిన వానకు ధాన్యం తడిసిపోయింది. రెండు సార్లు పడిన వానతో ధాన్యం కొంతమేరకు కొట్టకపోయింది. ఉన్న ధాన్యం తడిసిపోయింది. ఇలా ఎన్ని సార్లు ఆరబెట్టాలి. ఆకాల వర్షం.. సెంటర్ నిర్వాకుల నిర్లక్ష్యంతో కష్టం, నష్టం మిలిగింది.

**- ఎస్ రమేశ్, రైతు (పెద్దపల్లి)**



గన్నేరువరం: కుప్పల్లో నిలిచిన వరద నీటిని తొలగిస్తున్న రైతులు